# వ్యాస కౌముది



## చరిత్రను సృష్టించిన పాట
## వందేమాతరం చరిత్ర
## - కర్లపాలెం హనుమంతరావు

భారత స్వాతంత్రోద్యమం ఒక స్థితి రూపం దాల్చటానికి కొన్ని దశాబ్దాలకు ముందే, మన నవ జాతి గీతంగా వందే మాతరం చరిత్ర ప్రసిద్ధమైంది. ఆ గీతంలోని మొదటి చరణం మన జాతీయోద్యమ దీక్షా నినాదమైంది. పరాయి పాలకులకు రణన్నినాదమై, వారికి కంపరం పుట్టించింది. వేలాది సామాన్య ప్రజలు ఆ నినాదాన్నిఉచ్చరిస్తూ బ్రిటిష్ పాలకుల దౌర్జన్య కాండ నెదుర్కొన్నారు. అనేకమంది దేశభక్తులు ఆ మంత్రాన్ని పఠిస్తూ, ఉరికంబాలను కౌగలించుకున్నారు.

సుప్రసిద్ధ వంగ పత్రికా రచయిక, నవలాకారుడు అయిన బంకీమ్ చంద్ర చటోపాధ్యాయ గత శతాబ్ది చివరి పాదంలో తమ పత్రిక "బంగదర్శన్" కోసం యధాలాపంగా ఈ గీతం రాశారు. కాని, ఏ కారణం వల్లనో అది కొంతకాలంపాటు ప్రచురణ కాకుండా అలానే వుండిపోయింది. చివరకు ఆయన తన సుప్రసిద్ధమైన "ఆనంద మఠం " నవలలో దాన్ని పొందుపరచారు. దౌర్జన్య పరులయిన ఆనాటి ముస్లిం పాలకులపై ప్రజల తిరుగుబాటు సన్నివేశాలలో, దేశభ క్తి గేయంగా యిది ఆ నవలలో చోటుచేసుకొంది. " 20 ఏళ్ళ తరువాత వంగదేశాన్ని వెర్రెత్తిస్తుంది, చూస్తుండండి" అన్నారట ఆయన . కొందరు మిత్రులతో. దాదాపు మూడు దశాబ్దాల తరువాత, బ్రిటిష్ పాలకులు వంగదేశాన్ని విభజించ బూనుకొన్నప్పుడు, ఆయన జోస్యం అక్షరాలా నిజమైంది. బ్రిటిష్ పాలకులపై తిరుగబడిన వంగ ప్రజల స్వేచ్ఛా గీతమైంది అది.

1896 లో జరిగిన ఒక కాంగ్రెస్ సమా వేశంలో విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ మొదటిసారి వందేమాతరం గీతాలాపన చేశారు. 1905 లో బెనారస్ లో జరిగిన కాంగ్రెస్ మహాసభలోనూ, 1918 లో జరిగిన ఢిల్లీ కాంగ్రెస్ మహాసభలోనూ, రవీంద్రుని మేనకోడలు సరళాదేవి ఈ గీతాన్ని పాడారు. 1906 లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో బాలికలు దీన్ని బృందగానంగా ఆలపించారు. ప్రసిద్ధ గాయకుడు శ్రీ దిలీప్ రాయ్ ఈ గీతానికి ఒక బాణీ కూర్చి, గ్రామఫోన్ రికార్డు యిచ్చారు. వందేమాతరం గీతాన్ని దేశ మంతా పాడుకొనేందుకు వీలుగా, దానికి ప్రామాణికమైన స్వరకల్పన చేయాలని మొట్టమొదట సూచించిన వారు మహాత్మా గాంధీ.

1930 నాటికి జాతీయవాదుల చిన్న, పెద్ద సమావేశాలన్నిటిలోనూ వందేమాతరం గీతా లాపన సర్వసామాన్యమైంది.

ఉత్తరోత్తరా ద్విజాతి సిద్ధాంత ప్రతి పాదనకుడైన మొహమ్మద్ అలీ జిన్నా, ఆయన అనుచరులూ 1937 లో, వందే మాతరం గీతం గత చరిత్రను తవ్వితీసి, జాతీయవాదుల సమావేశాల్లో దాన్ని పాడరాదని అభ్యంతరం లేవదీశారు. కాని జాతీయవాద ముస్లిం నాయకులైన మొహ్మద్ అలీ (అలీ సోదరుల్లో ఒకరు), మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి వారు జిన్నా అనుచరుల వాదనలను గట్టిగా ప్రతిఘటించారు.

1937 లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభ వందేమాతరం గీతాన్ని జాతీయ గీతంగా నిర్ణయిస్తూ, ముస్లింల మతభావాలను గాయపరచే విధంగా వున్న కొన్ని చరణాలను దానిలో నుంచి మినహాయించింది.

బ్రిటిష్ పాలకులు 1905లో ఈ గీతాన్ని బహిరంగ సమావేశాల్లో పాడరాదని నిషేధించారు. కానీ ఆ సంవత్సరం ఆగస్టు 7న కలకత్తా టౌన్ హాల్, వంగదేశ విభజనను నిరపించేందుకు జరిగిన సభలో వేలాది మంది హిందూ, ముస్లిం యువకులు, “వందేమాతరం” అంటూ దిక్కులు పిక్క టిల్లేలా నినదించారు. బారిసాల్లో పది వేలమంది హిందువులు, ముస్లింలు ఈ గీతాన్ని ఆలపిస్తూ ఒక ప్రదర్శన జరిపారు. 1906లో జాతీయోద్యమం వలంటీర్లు ఈ గీతం ఆలపిస్తూ, కలకత్తా నగర వీధుల్లో తిరిగి ఉద్యమ నిధి పోగుచేస్తుండేవారు. రవీంద్రనాథ్ టాగూరు కూడా తరచు వీరిలో వుండేవారు.

1908 లో కలకత్తా కాంగ్రెస్ మహా సభలో అధ్యక్షులు దాదాభాయ్ నౌరోజీ నాగరి లిపిలో "వందేమాతరం" అని రాసిన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

బ్రిటిష్ పాలకులు విభజించి పాలించే తమ సాంప్రదాయక నీతి ననుసరించి వందే మాతరం గీతం అచ్చంగా , మతతత్వపూరిత గీతం అంటూ భారతదేశంలోనూ, బ్రిటన్ దేశంలోనూ కూడా పత్రికల్లో పెద్ద రగడ లేవదీశారు. కాని, ఉదారవాదులైన కొందరు బ్రిటిష్ మేధావులు, ఈ వాదాన్ని ఖండిస్తూ "ఇది హిందూ మతంలోని ఒకానొక దేవతను, మాతృ దేశానికి ప్రతీకగా భావించి చేసిన స్తోత్రం తప్ప వేరేమీ కాదు. దేశాన్ని నా తల్లిగా భావించి ఆరాధించటంలో అభ్యంతరం చెప్పవలసిందేమీ లేదు" అంటూ హెన్రీ కాటన్, గ్రీర్సన్, ఆండర్సన్ అనే ముగ్గురు బ్రిటిష్ పండితులు (వీరు ముగ్గురూ భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేసినవారే) ఇంగ్లీషులో లండన్ టైమ్స్ లో రాశారు. ఆ ఆంగ్లానువాదాన్ని కూడా ఈ గీతం ంచింది.

ఎన్ సైక్లోపీడియా బ్రిటానికా (బ్రిటీష్ విజ్ఞాన సర్వస్వ గ్రంధం) 11వ ముద్రణలో ఈ గీతం ఆంగ్లానువాదాన్నీ, సమగ్ర చరిత్రనూ ప్రచురించారు. ఆ రోజుల్లో దక్షిణాఫ్రికాలో వున్న గాంధీజీ, వందేమాతరం గీతం అత్యంత ఉదాత్తభావాలను వ్యక్తం చేస్తూ వుందనీ, అది భారత జాతీయ గీతమైందనీ, యితర దేశాల జాతీయ గీతాల్లో యితర జాతులను కించపరచే అంశాలు ఏవో ఒకటి వుండగా ఈ గీతంలో అలాంటిదేదీ మచ్చు కైనా లేదని 1906 లో "ఇండియన్ ఒపీనియన్" అన్న పత్రికలో రాశారు.

పూర్వాశ్రమంలో విప్లవకారుడైవ అరవింద ఘోష్ ఈ గీతాన్ని యింగ్లీషులోకి (వచనంగాను, గేయంగానూ కూడా) అనువ దించారు. హరినాథ్ డే అనే సుప్రసిద్ధ భాషా వేత్త ఒకాయన కూడా ఈ గీతాన్ని ఆంగ్లం లోకి అనువదించారు.

1908 లో అరవిందులు, బిపిన్ పాల్ కలిసి 'వందేమాతరం" అనే పేరిట ఒక పత్రిక ప్రారంభించారు, కాని బ్రిటిష్ ప్రభుత్వం దాన్ని వెంటనే నిషేధించింది.సుప్రసిద్ధ విప్లవకారిణి మదాం కామా స్విట్జర్లాండ్ నుంచి కొంత కాలం పాటు ఒక విప్లవ పత్రికను నడిపారు. పంజాబ్ కేసరి లాలా లజపత్ రాయ్ కూడా వందేమాతరం అనే పేరిటి ఒక పత్రికను నడిపారు. అది కూడా బ్రిటిష్ పాలకుల ఆగ్రహానికి బలైంది. దక్షిణాఫ్రికాలోని భారత జాతీయ వాదులు 1911 లో వందే మాతరం లీగ్ అనే ఒక సంస్థను స్థాపించారు. 1907 లో స్టట్ గార్టులో జరిగిన రెండవ

ఇంటర్నేషనల్ 7 వ మహాసభలో మదాం కామా దేవనాగరి లిపిలో 'వందేమాతరం' అన్న నినాదం రాసిన భారత జాతీయ త్రివర్ణపతాకను లెనిన్, లునాచార్స్కి, రోజా లక్జెంబర్గ్ మొదలైన అంతర్జాతీయ విప్లవకారుల సమక్షంలో ఆవిష్కరించారు.

పూర్వపు నిజాం సంస్థానంలో కూడా 1930 దశకం చివరలో వందేమాతరం గీతాన్ని పురస్కరించుకొని ఒక పెద్ద ఉద్యమం వెల్లివిరిసింది. ఉస్మానియా విశ్వ విద్యాలయ వసతి గృహాల్లో ఈ గీతాన్ని పాడరాదని అప్పటి ప్రభుత్వం జారీచేసిన నిరంకుశ ఉత్తర్వును నిరసిస్తూ, సంస్థాన మంతటా వేలాది విద్యార్థులు బ్రహ్మాండమైన సమ్మె పోరాటం నిర్వహించారు. తెలంగాణా ప్రాంతంలోని కాంగ్రెస్, కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఈనాడు పాత తరానికి చెందిన వారిలో ఎక్కువమంది ఈ విద్యార్థి ఉద్యమ ప్రభావంతో రాజకీయరంగంలోనికి వచ్చిన వారే. ఆంధ్రలో విజయనగరంలో 'వందేమాతరం' అన్న పేరుతో ఒక వారపత్రిక 1940–45 ప్రాంతంలో వచ్చేది.

వందేమాతరం గీతం చరిత్రాత్మకమైన గీతమేకాదు, చరిత్రను సృష్టించిన గీతం కూడా.

★★★

COMMENTS